నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | ఏప్రిల్ 23, 2024 | www.navatelangana.com

ప్రమాదవశాత్తు వడ్ల కుప్ప ఢీకొని ఒకరు మృతి



మృతి చెందిన సాయిలు

నవతెలంగాణ-నవీపేట్

ప్రమాదవశాత్తు వడ్ల కుప్ప ఢీకొని ఒకరు మృతి చెందారు. ఈ ఘటన నవీపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాసర వెళ్లే రహదారిపై చోటుచేసుకుంది. ఎస్సై యాదగిరిగౌడ్ వివరాల ప్రకారం.. నాగేపూర్ గ్రామానికి చెందిన సాయిలు (41) సోమవారం నాగేపూర్ నుంచి నవీపేట్ వైపు మోటార్ బైక్‌పై వస్తున్నాడు. ప్రమాదవశాత్తు రోడ్డుపై గల వడ్లకుప్పను ఢీకొనడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం మేరకు ఎస్సై యాదగిరి గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నారు.

చెడుగొట్టు వానతో ఇల్లు ధ్వంసం



నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మల్లూరు గ్రామంలో సోమవారం సాయంత్రం బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో గాండ్ల నారాయణ నివాసపు రేకుల ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. గత కొంతకాలం క్రితమే అప్పులు చేసి మరీ ఇల్లు నిర్మించి జీవనం కొనసాగిస్తున్నది ఆ కుటుంబం. ఈదురుగాలులతో కూడిన వానతో ఇల్లు ధ్వంసం కావడంతో ఆ బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

రైతులకు అండగా ఉంటాం

- ఇండియా కూటమితోనే అది సాధ్యం
- మోసం చేసేవాళ్లం కాదు
- హామీలన్నీ అమలు చేస్తాం
- సెప్టెంబర్ 17లోపు షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తాం
- ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ చేస్తాం
- నిజామాబాద్ జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందని, అది ఇండియా కూటమితోనే అది సాధ్యమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం నిజామాబాద్ నగరంలోని పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా జీవన్‌రెడ్డి ఎన్నికల్లో పోటీ చేస్తున్నాడని ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని అన్నారు. భారతదేశంలో పంజాబ్, హర్యానా రైతులు ఎంత చురుకైన వారో నిజామాబాద్ జిల్లాలో ఆర్మూర్ రైతులు అంతే చురుకైన వారని కొనియాడారు. ఆర్మూర్‌లో పసుపు, ఎర్రజొన్న రైతులను ప్రశంసించారు. మూతపడిన చక్కెర కర్మాగారాన్ని సెప్టెంబర్ 17లోపు తెరిపిస్తామని హామీనిచ్చారు. 2004, 2009 పార్లమెంట్ ఎన్నికలలో మధుయాష్కీ గౌడ్‌ను ప్రజలు గెలిపిస్తే తెలంగాణ సాధన కోసం ఆయన ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 2014 ఎన్నికలలో కేసీఆర్ 100 రోజుల్లోనే చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తామని హామీవ్వడంతో కవితను గెలిపించినా.. పసుపు, ఎర్రజొన్నలు వాణిజ్య పంటలు పండించే రైతులకు ఎటువంటి లాభం చేకూర్చలేదని, దాంతో 2019 ఎన్నికలలో రైతులే 180 మంది అభ్యర్థులు కవితపై ఎంపీ ఎన్నికలలో నామినేషన్లు వేసి ఓడించి, బొంద పెట్టి కాంక్రీట్‌తో శాశ్వతంగా సమాధి చేశారని చురకలాంటించారు. నిజామాబాద్ రైతాంగంతో పెట్టుకుంటే శాశ్వతంగా మట్టి కల్పిస్తారని అన్నారు. ఆ తర్వాత ధర్మపురి అరవింద్ బాండ్ పేపర్ రాసిచ్చి ఐదు రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని హామీ ఇచ్చినా, పసుపు బోర్డును తీసుకురాకపోగా "స్పైసెస్ ఎక్స్టెన్షన్"నే పసుపు బోర్డు అని నమ్మించే ప్రయత్నం చేశారని, దానికి నిజామాబాద్ రైతులు గమనిస్తూనే ఉన్నారని ఆ దెబ్బతోనే ప్రధానమంత్రితో పసుపు బోర్డు ఏర్పాటు చేయడానికి సిద్ధం చేశామంటూ జీవోను విడుదల చేసిన అందులో ఎక్కడ ఏర్పాటు చేస్తారో ఆ స్థలాన్ని, ఆ అంశాన్ని అందులో వివరించలేదని అన్నారు. రైతులకు అండగా ఉంటామని, అది ఇండియా కుటమితోనే సాధ్యమవుతుందని చెప్పారు. 2014లో కవితను, 2019లో అరవింద్‌ను గెలిపిస్తే వారు రైతులను మోసం చేశారని, కానీ మేము మోసేటోళ్ళమే కానీ, మోసం చేసే వాళ్ళం కాబోమని స్పష్టం చేశారు. బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఓటేస్తే వాళ్ళ కొడుకులే ఆంబోతుల తయారవుతారని విమర్శించారు. అందుకే రైతుబిడ్డ అయిన రైతు నాయకుడు జీవన్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని, ఆయనకు ఓటేస్తే రేవంతన్న అభిమానాన్ని చాటుకున్న వాళ్లవుతారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత హామీలను అమలు చేస్తుందని, అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో కొన్ని హామీలు ఆగిపోయాయని ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. రైతు పండించిన పంటకు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తామని, అది మా బాధ్యత అని అన్నారు. రైతులకు కేసీఆర్ వరి వేస్తే ఉరే అన్నారు.. కానీ రైతులు వరి ఎంత పండించినా.. దానిని బోనస్ ఇచ్చే కొనుగోలు చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, ఉర్దూ అకాడమీ చైర్మెన్ తాహెర్‌బిన్ హందాన్, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పార్టీ మారే ప్రసక్తే లేదు

- ఇతర పార్టీ నాయకులు తమపై బురద చల్లుతున్నారు
- లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేది బీఆర్ఎస్ అభ్యర్థి మాత్రమే
- భారీ మెజార్టీతో గెలవబోతున్నాం
- ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్/రామారెడ్డి

బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇతర ఏ పార్టీకీ మారే ఆలోచన లేదని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ స్పష్టం చేశారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీని వదిలి ఇతర ఏ పార్టీలోకి వెళ్లే ఆలోచనలో తానులేనని ఆయన స్పష్టం చేశారు. ఇతర పార్టీల నాయకులు తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులను, ఎంపీటీసీలను, సర్పంచ్‌లను కొన్నట్లు తమను కొనలేరని ఆయన తెలిపారు. తాము బీఆర్ఎస్ పార్టీలోనే ఉండి బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బిజెపి రెండు జాతీయ పార్టీలు కూడా ప్రజా పాలనలో విఫలమయ్యాయని, ప్రజలను అన్ని రకాలుగా అభివృద్ధి పరిచే పార్టీ బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని వివరించారు. లోక్‌సభలో తెలంగాణ తరఫున గొంతు విప్పి మాట్లాడేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న 6 గ్యారంటీలు మోసపూరిత గ్యారెంటీలని, ఆ పథకాల వల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని ఆయన అన్నారు. గతంలో రైతు బీమా వారంలోగా అందించే వాళ్ళమని ఇప్పుడు రెండు నెలలు గడుస్తున్నా రైతుబీమా పథకం డబ్బులు బాధితులకు రావడం లేదని ఆయన ధ్వజమెత్తారు. వచ్చే నెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రైతులు తగిన బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. ఉద్యమం చేసి సాధించిన తెలంగాణ ప్రజలు కేవలం బీఆర్ఎస్ పార్టీనే నమ్ముతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త తిరుమల్ రెడ్డితోపాటు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రాల సిద్దయ్య, ఎంపిటిసి శ్రీనివాస్ నారాయణ, నాయకులు హనుమంత్ రెడ్డి, సంతోష్‌గౌడ్, వెంకటరెడ్డి, ఫరీద్, లక్ష్మీకాంతం, కృష్ణ, మంగలి యాదగిరి, ఆత్మకూరు బాబురావు, వంశీ గౌడ్ తదితరులున్నారు.

వరి పంటకు రూ.500 బోనస్ వెంటనే అందించాలి..

రామారెడ్డి : రైతులను ఆదుకుంటామని ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా వరి క్వింటాలుకు రూ.500 బోనస్ వెంటనే అందించాలని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో భాగంగా డిసెంబర్ 9 నుంచి వరి క్వింటాకు రూ.500 చెల్లిస్తామని చెప్పి మాట తప్పిన ప్రభుత్వం, యాసంగి పంటకైనా రూ.500 బోనస్‌ను అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దశరథ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రంగు రవీందర్ గౌడ్, నారాయణరెడ్డి, గ్రామ అధ్యక్షులు భానురి నర్సారెడ్డి, నాయకులు రాజేందర్‌గౌడ్, లింబాద్రి నాయక్, పాల మల్లేష్, జంగం లింగం, కొత్తొల్ల గంగారం, సంకి లింగం, కుశంగి రాజనర్సు, దండ బోయిన సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

చేపలు పట్టేందుకు..
నిండు చెరువు ఖాళీ

- నీట మునిగిన వరి పంట
- లబోదిబోమంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

చేపలు పట్టేందుకు అక్రమార్కులు చెరువులను ఖాళీ చెయ్యడంతో వందలాది ఎకరాల వరి పంట నీటి మునుగుతుంది. వేసవి దృష్ట్యా భూగర్భజలాలు అడుగంటుతున్న తరుణంలో సాగునీటి నీటిని వృథాగా విడిచిపెట్టడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలంలోని మీర్జాపూర్ ఊర చెరువులో చేపలు పట్టేందుకు నీటిని తూముల గుండా తొలగిస్తున్నారు. వారం రోజులకుపైగా నీటిని వదలడంతో చెరువు కింద ఉన్న పంట పొలాలు నీటితో నిండి ఉండడంతో వరి కోతలకు ఇబ్బందిగా మారింది. ఎకరం పంట పొలం గంటలో వరి కోత కావలసి ఉండగా ఎకరం వరి కోత యంత్రానికి రెండు గంటల సమయం పడుతుంది. దీనితో రైతులకు పెనుభారంగా మారింది. చెరువులో నీటి నిల్వ సగానికి తగ్గిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదు.



నీట మునిగిన వరి పంట

ఇదిలా ఉండగా అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు చెరువు శిఖాన్ని కబ్జా చేశారు. అందులో బావులు తవ్వారు. కొంతమంది నాయకులు చెరువును అడ్డు పెట్టుకుని వ్యాపారం చేస్తున్నారు. ఇదిలా ఉండగా చెరువు శిఖాన్ని కబ్జా చేసిన నాయకులు, వ్యాపారుల అండదండలతో చెరువు నీటిని తొలగిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మత్స్యకార్మిక శాఖకు బాధ్యతలు అప్పగించడంతో చెరువు గురించి పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. గతంలో చెరువుల ద్వారా గ్రామ పంచాయతీలకు ప్రతిఏటా ఆదాయం వచ్చేది. ప్రస్తుతం మత్స్యకార్మిక శాఖకు ఇవ్వడంతో ఆ అధికారులు కూడా నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొన్ని రోజులుగా చెరువులో నీరు తొలగిస్తుండగా నీరంతా వృథాగా పోతోంది. మీర్జాపూర్ గ్రామస్తులకు ప్రతి ఏడాది వేసవిలో నీటి అవసరాలకు ఊరచెరువు ఎంతగానో ఉపయోగపడుతుంది. గ్రామంలోని పశువులు కూడా చెరువు నీటితోనే దాహం తీర్చుకుంటున్నాయి. ఇంత ఉపయోగకరం ఉన్న చెరువు నీరు వృథాగా పోతున్నా అధికార యంత్రాంగానికి గ్రామస్థులు అనేకసార్లు ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నీటిని వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. లింగగిరి, బూరుగడ్డ చెర్వుల్లోనూ మత్స్యకార్మికులు నీటిని తోడి చేపలు పడుతున్నారు.

చెరువు నీటిని వృథా చేయవద్దు

చెరువు నీరు విడుదల చెయ్యడంతో చేతికి వచ్చిన వరి పంట నీట మునిగింది. చెరువు నీటిని వృథాగా వదలవద్దు. ప్రతి ఏటా చెరువు నీరు వేసవి అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. వేసవిలో నీటి అవసరాలను గుర్తించి నీటివృథాను అధికారులు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాస్ రైతు మిర్జాపూర్

జహీరాబాద్ ఎంపీ స్థానానికి ఏడుగురు నామినేషన్లు

నవతెలంగాణ-కామారెడ్డి

జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి సోమవారం ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు వేయగా తొమ్మిది సెట్లు అందినట్లు ఎన్నికల కమిషనర్ క్రాంతి వల్లూరు తెలిపారు. బీజేపీ నుంచి బీబీ పాటిల్ ఒక సెట్టును కామారెడ్డి నియోజకవర్గం ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు అరుణతారతో కలిసి ఒక సెట్‌తో నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి సురేష్ కుమార్ షెట్కర్ తరపున మనీష్ కుమార్ పాటిల్ ఒక సెట్‌ను నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి క్రాంతి వల్లూరుకు అందజేశారు. తెలంగాణ ప్రజాశాంతి పార్టీ నుంచి కొత్త బలిజ బసవరాజ్ రెండు సెట్లతో నామినేషన్ వేశారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుండి మల్లెపు మోహన్‌రెడ్డి ఒక సెట్టుతో నామినేషన్ దాఖలు చేశారు. ఇండిపెండెంట్‌గా గంగారం, రమేష్ సజ్జాపూర్ ఒక్కొక్క సెట్‌తో నామినేషన్ వేయగా, మరో స్వతంత్ర అభ్యర్థి అయిన ఎం.రవి మహదేవ్ స్వామి రెండు సెట్లతో నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

వాతావరణ పరిస్థితులపై రైతులను అప్రమత్తం చేయాలి

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్



నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

రాగల మూడు రోజుల్లో రాష్ట్రంలో ఉరుములు మెరుపులతో కూడిన ఒక మోస్తారుగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో రైతులను అప్రమత్తం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్ అధికారులకు సూచించారు. సోమవారం అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుండి అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పౌర సరఫరాల, మార్కెటింగ్, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్నారు. అకాల వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ముందస్తుగా తీసుకోవలసిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై కమిషనర్ దిశా నిర్దేశం చేశారు. వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని జాప్యానికి తావు లేకుండా వెంటదివెంట నిర్దేశిత రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. కాగా, అనివార్య కారణాల వల్ల వర్షాలకు ధాన్యం తడిచినా కూడా రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని కమిషనర్ చౌహాన్ భరోసా కల్పించారు. తడిచిన ధాన్యాన్ని ఎండబెట్టిన మీదట కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించడం జరుగుతుందని తెలిపారు. రైతుల వద్ద నుండి చివరి గింజ వరకు కూడా ధాన్యాన్ని పూర్తి స్థాయి మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు పౌర సరఫరాల శాఖ సంసిద్ధమై ఉందన్నారు. అయితే రైతులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టి ధాన్యం నిల్వలు తడిసిపోకుండా చూసుకోవాలని హితవు పలికారు. కాగా రైతుల నుండి సేకరించే తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులకు తరలించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకొని తదనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని కమిషనర్ అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సివిల్ సప్లైస్ డీఎం జగదీశ్, డీఎస్ఓ చంద్రప్రకాశ్, మార్కెటింగ్ శాఖ అధికారిణి గంగవ్వ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ ప్రచారం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పర్మల్ల, బోనాల, మేంగారం, అయ్యపల్లి, శెట్పల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అలాగే ఉపాధి హామీ పనుల వద్ద, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కర్‌కు తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మేనిఫెస్టో కరపత్రాలను కూలీలకు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందన్నారు. దీంతో అభివృద్ధి ముందుకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బుర్ర నారాగౌడ్, లింగంపేట్ జెడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్‌రెడ్డి, యూత్ అధ్యక్షులు సుప్పాల రాజు, పార్టీ సీనియర్ నాయకులు సాయికుమార్, వంజరి ఎల్లమయ్య, మాజీ సర్పంచ్ రామ్‌రెడ్డి, సాయిలు, మోహన్‌గౌడ్, మాకం రాములు, హరి సత్యం తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిని బహిష్కరిస్తాం

- బీజేపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

నవతెలంగాణ-లింగంపేట్

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిని పార్టీ నుంచి బహిష్కరిస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు తేల్చి చెప్పారు. సోమవారం మండలం కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ కళ్యాణ మండపంలో మండల స్థాయి గ్రామస్థాయి అధ్యక్ష కార్యదర్శుల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం ప్రతీ కార్యకర్తతో ముఖాముఖీగా చర్చించారు. ఇప్పటికి వరకు ఎన్ని ఓట్లను కాంగ్రెస్ వైపు వచ్చేలా చేసారు?, వ్యక్తిగతంగా ఎన్ని ఓట్లు వేయిస్తారో కార్యకర్తలతో మాట తీసుకున్నారు. ఇంటింటి ప్రచారంపై సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. మండల సమావేశాలలో చెప్పిన పనులను పూర్తి చేయని వారిని తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎవరు అయితే పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తారో వారిని పార్టీ నుంచి బహిష్కరిస్తామని అన్నారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ తీసుకురావాలన్నారు. ప్రతి మండలంలో ఇలాగే సమీక్ష మీటింగ్ నిర్వహిస్తామని అన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త సూచించిన పనులను పూర్తి చేసి మెజారిటీ దిశగా ముందుకు సాగాలన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త సుమారుగా తమ వ్యక్తి గతంగా 50 నుంచి 60 ఓట్లు తమ బాధ్యతగా తీసుకొని ఇంటింటి ప్రచారం నిర్వహించాలని సూచించారు. కాంగ్రెస్ హామీలు, రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే ద్వారానే ప్రతి పథకం అందుతుందనే విషయాన్ని ప్రతి ఓటరుకు తెలిసేలా చెప్పాలన్నారు. బీజేపీ వైఫల్యాలను, బీబీ పాటిల్ అక్రమాలను ప్రజలకు చెప్పాలని తెలిపారు. బీజేపీ టికెట్ అమ్ముకొని బీబీ పాటిల్‌కు ఇచ్చిన విషయాన్నీ ప్రజలకు తెలియచేయాలన్నారు. కష్టపడ్డ వారికి తగిన గుర్తింపుని ఇస్తామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారాగౌడ్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుప్పాల రాజు, లింగంపేట్ జెడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి, సర్పంచులు రామ్‌రెడ్డి, పద్మ నాగరాజు, కాంగ్రెస్ మండల నాయకులు వంజరి ఎల్లమ్మయ్య, దురిశెట్టి అశోక్, డాక్టర్ విక్టర్, డాక్టర్ రాజు, రఫీఉద్దీన్, దశరథ్ నాయక్, నగేష్, కుద్దూస్, కిరణ్, గ్రామ కమిటీ అధ్యక్షులు, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రెడ్డి

రైతులను మోసగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

నవతెలంగాణ-దోమకొండ

కల్లబొల్లి మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తూనే ఉందని మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. మండలంలోని అంచనూర్ గ్రామంలో సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన క్వింటాల్ వరి ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పినప్పటికీ, ఇప్పటి వరకు అమలు చేయలేక పోయిందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ సగం మంది రైతులకు కూడా రైతుబంధు అందించలేకపోయిందన్నారు. ఖరీఫ్, యాసంగి సీజన్‌కు అనుకూలంగా రైతులకు రైతుబంధు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరి ధాన్యానికి 500 రూపాయల బోనస్ తప్పనిసరిగా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. వాతావరణ మార్పులతో వర్షాలు పడుతున్నందున తడిచిన ధాన్యాన్ని సైతం కచ్చితంగా కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంద్ర మధుసూదన్‌రావు, బీఆర్ఎస్ అంచనూరు గ్రామ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ దోర్నాల లక్ష్మణ్, మాజీ ఉపసర్పంచ్ నరేష్ కుమార్, మాజీ సిడిసి చైర్మన్ ఐరేని నరసయ్య, యూత్ మండల అధ్యక్షులు పాలకుర్తి శేఖర్, మండల నాయకులు నల్లపు శ్రీనివాస్, గజవాడ శ్రీకాంత్, బుర్రి రవికుమార్, నారాగౌడ్, కిషన్‌రెడ్డి, బొమ్మెర గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కందకుర్తి ఎంపీటీసీ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-రెంజల్

ఈనెల 17న ఎంపీటీసీ అసాద్ బేగ్ అన్న సలీం బేగ్ కుమారుడు నవాజ్ తన స్నేహితులతో కలిసి సమీపంలో ఉన్న గోదావరి నదిలో స్నానం చేయడానికి వెళ్లి ఈత కొడుతూ గోదావరిలో ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్ సతీమణి అయేషా ఫాతిమా సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇంటి పెద్ద కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు మనోధర్యంగా ఉండాలని ఆమె అన్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకులు రఫీ ఉద్దీన్, తాజా మాజీ సర్పంచ్ కలీం బేగ్, ఎంపీటీసీ అసాద్ బేగ్, అధ్యక్షులు మోసిన్ బేగ్, నీలా పేపర్ మిల్ గ్రామ అధ్యక్షులు అవేజ్ ఖాన్, సోషల్ మీడియా కన్వీనర్ ముఖీద్, శ్రీకాంత్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి

- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి

నవతెలంగాణ-రెంజల్

ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పనిసరని, ఆయన ఉద్యోగంలో చేరినప్పటి నుంచి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి చేసిన కృషి మరువలేనిదని పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని తాడ్‌బిలోలి జిల్లా పరిషత్ పాఠశాల హిందీ ఉపాధ్యాయులు రాజేందర్ సింగ్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 19 సంవత్సరాల కిందట రెంజల్ మండలంలో అడుగుపెట్టిన రాజేందర్ సింగ్ వివిధ పాఠశాలల్లో అనేకమంది విద్యార్థిని విద్యార్థులకు విద్యను బోధించి ప్రయోజకులను చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు యోగాను నేర్పించడం ఆయన ప్రత్యేకత అన్నారు. తాను బోధించిన విద్యార్థులు నేడు అనేక ప్రభుత్వ ఉద్యోగాలలో చేరారని ఆయన పేర్కొన్నారు. రాజేందర్ సింగ్‌కు రెంజల్ మండలంతో విడదీయరాని సంబంధం ఏర్పడిందని ఆయన స్పష్టం చేశారు. ఆయన అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులతో సన్నిహిత సంబంధం ఏర్పడడంతో పలువురు ఉపాధ్యాయులు కంటతడి పెట్టారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గణేష్ రావు, మాజీ జిల్లా అధ్యక్షులు ఇల్తేపు శంకర్, పిఆర్టియు మండల అధ్యక్ష కార్యదర్శులు టి. సోమలింగం గౌడ్, సాయిరెడ్డి, మండల కార్యదర్శి గోవర్ధన్, తాహర్, అబ్బయ్య, కిషోర్, అబ్దుల్ కరీం, విద్యా వనరుల శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడికి సన్మానం

మేడే కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

వచ్చే నెల ఒక్కటి నుండి ఏడు వరకు ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డే వారోత్సవాల సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కరపత్రాలను ఆవిష్కరించారు. మేడేను వారోత్సవాలుగా నిర్వహించా లని అంకాపూర్‌లోని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఇంటి వద్ద కలిసి మేడే వారోత్సవాల కరపత్రాలని ఆవిష్కరించారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు (శ్రామిక స్పందన)రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి తూర్పాటి శ్రీనివాస్, భారత రైతు కూలి సంఘం రాష్ట్ర రాష్ట్ర ఉపాధ్యక్షులు బొట్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఇసీసీఇడే


కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు, తల్లులు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని అంగన్ వాడి కేంద్రంలో సాముహిక ఎర్లీ చిల్డ్రన్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ డే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూపర్ వైజర్ సునీత పాల్గొని రెండున్నర సంవత్సరాల పిల్లలను నర్సరీలో, మూడున్నర సంవత్సరాల పిల్లలను ఎల్‌కేజీలో, నాలుగున్నర సంవత్సరాల పిల్లలను యుకేజీలో చేర్పించాలని పిల్లల తల్లులకు సూచించారు. వచ్చే సంవత్సరం ప్రీ స్కూల్ పాంప్లెట్స్ పంచడం, అసైన్మెంట్ కార్డ్స్ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్లు నసీమ, భారతి, రజత, అంజలి, ప్రిస్కూల్ పిల్లల, తల్లులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

- గల్ఫ్ సంక్షేమ సంఘం



నవతెలంగాణ-ఆర్మూర్

గల్ఫ్ మృతులకు రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా ఇచ్చినందుకు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘము ఎన్ ఆర్ఐ బృందం సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ని కల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఎన్ఆర్ఐ పాలసీ అమలు చేయాలని, గల్ఫ్ కార్మికుల కోసం కోటపాటి నరసింహా నాయుడు ఎంతో కష్టపడుతున్నారని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఎన్ ఆర్ఐల తరుపున అధ్యక్షులు బట్టు స్వామి కృతజ్ఞతలు తెలిపారు. వీరితోపాటు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఎన్ఆర్ఐ ఉపాధ్యక్షుడు గురాయి రాజేందర్, సౌదీ ఉపాధ్య క్షుడు పీర్ల దేవదాస్ (కుర్మ)లు కృతజ్ఞతలు తెలిపారు. కువైట్ ఉపాధ్యక్షుడు గున్నల విక్రమ్, సభ్యులు ఆర్మూర్‌లో గల్ఫ్ కార్మికుల కోసం ప్రెస్ మీట్ ఏర్పా టు చేసి మాట్లాడినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్టు చెప్పారు.

గంజాయి, సైబర్ నేరాలపై అవగాహన


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-బాల్కొండ

మండలకేంద్రంలో జమా మస్జిద్ వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం గంజాయి, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై శంకర్ మాట్లాడుతూ యువకులు గంజాయికి అల వాటు పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఎవరైనా గంజాయి అమ్మిన, తాగిన పోలీస్ శాఖకు సమాచారం అందించాలని ప్రజల కు సుచించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోను చేసి మీ యొక్క సమాచారం సేకరిస్తారని, వాటి ద్వారా అకౌంట్ నుండి డబ్బులు మాయం చేస్తారని తెలిపా రు. గుర్తుతెలియని వారు ఫోన్లు చేస్తే సంబంధిత పోలీస్ శాఖకు సమాచా రం అందించాలని అన్నారు. చిన్నపిల్లలు స్మార్ట్ ఫోన్ వాడటం వల్ల అందులో కొత్తగా యాప్స్ వేసుకుని సైబర్ నేరాలకు బలి అవుతున్నారని, సెల్ ఫోన్ ఉపయోగించకుండా చూడాలని అన్నారు. ప్రమాదవశాస్తు ఎక్కడైనా రోడ్డు ప్రమాదంలో జరిగిన వెంటనే 100 ఫోన్ కాల్ ఉపయోగించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ విట్టల్, కానిస్టేబుల్ లింగన్న, సాయికుమార్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బిఎడ్ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ప్రశాంతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఎడ్ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు నాలుగవ రోజు ప్రశాంతంగా జరిగాయి.సోమవారం జరిగిన పరీక్షలకు 865 మంది విద్యార్థులకు 826 మంది విద్యార్థులు హాజరయ్యారు 39 మంది గైరాజరయ్యారు

బిఎడ్ పరీక్ష కేంద్రాలు..

గిరిరాజ్ గవర్నమెంట్ డిగ్రీ కాళాశాల నిజామాబాద్, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామారెడ్డి, ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కాళాశాల బాన్సువాడ,ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్మూర్, ప్రభుత్వ డిగ్రీ కాళాశాల బోధన్ సెంటర్ ల లో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

సిఎం సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి టి. జీవన్ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి సోమవారం ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రావడంతో డిచ్‌పల్లి, ఇందల్ వాయి మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున నిజామాబాద్‌కు తరలి వెళ్లారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలను స్వీకరించి మొట్టమొదటి సారిగా జిల్లాలో ఎనుముల రేవంత్ రెడ్డి సభ పెట్టడంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీగా తరలివెళ్ళినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్ తెలిపారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేష్

నవతెలంగాణ-మాక్లూర్

ఆలూరు మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన బాధిత కుటుంబాన్ని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కల్లెడ గ్రామానికి చెందిన బోడిగం నాగేష్ తమ్ముడు బోడిగం రామ్మోహన్ కుమారుడు గత నెలలో బ్రెయిన్ శస్త్ర చికిత్స తరువాత మృతి చెందాడు. వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొత్తూరు గంగాధర్, గ్రామానికి చెందిన బీజేవైఎం మండల అధ్యక్షులు గంగోల్ల ప్రళయ్ తేజ్, బూత్ అధ్యక్షులు మీరా అనిల్, సిరికొండ సాయికుమార్, బండారి మధు, గ్రామ ఇంచార్జ్ ఐలి వినోద్, సలహాదారులు ఇస్సాపల్లి భూమన్న, యూత్ అధ్యక్షులు మచ్చర్ల అర్జీత్, భూమన్న, కిసాన్, నరేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

లెనిన్ ఆశయాలను సాధించాలి

- సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా


ఆర్మూర్: లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


నిజామాబాద్ జిల్లా కేంద్రంలో..

నవతెలంగాణ-ఆర్మూర్

కామ్రేడ్ లెనిన్ ఆశయాలను సాధించాలని, వారు పోరాటం చేసిన శ్రామిక వర్గం వైపు అందరూ నడవాలని డివిజన్ కార్యదర్శి దేవారం అన్నారు. సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా పార్టీ కార్యాలయం కుమార్‌నారాయణ భవన్‌లో లెనిన్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. సిపిఐ ఎంఎల్ పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భం గా డివిజన్ కార్యదర్శి దేవారం మాట్లాడుతూ.. శ్రామికుల ను ఏకం చేస్తూ ప్రపంచ చరిత్రలో విప్లవ కారుల్లో ముందు నిలిచిన కామ్రేడ్ లెనిన్ అన్నారు. అదేవిధంగా కామ్రేడ్ లెనిన్ జయంతి నాడే రివిజనిస్టులతో విభేదించి వేరుపడి విప్లకారుల కలయికతో సిపిఐ ఎంఎల్ పార్టీ ఏర్పాటైంద న్నారు. ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు ఏం ముత్తెన్నలి మాట్లా డుతూ.. కామ్రేడ్ లెనిన్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాటం చేసి ప్రపంచ విప్లవకారుడుగా గుర్తింపు పొందా డని ఆయన స్ఫూర్తితో మతోన్మాద ప్రభుత్వంపైన పోరాటం చేయాలన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పాలని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ ప్రజాపంథా సబ్ డివిజన్ నాయకులు తలారి గంగాధర్, ఆకుల గంగన్న, సునీత, లక్ష్మి, అనిల్‌కుమార్, పార్టీ నాయకులు నజీర్, గంగాధర్, తొర్లికొండ నిఖిల్, పిడిఎస్‌యూ నిఖిల్, సిద్ధార్థ, మమత, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ : మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ 154వ జయంతి, సీపీఐ (ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యాలయం ఎన్ఆర్ భవన్, కోటగల్లీలో లెనిన్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా వనమాల కృష్ణ మాట్లాడుతూ.. రష్యన్ బోల్సివిక్ నిర్మాతగా, అక్టోబర్ విప్లవ సారథిగా, కమ్యూనిస్టు విప్లవోద్యమానికి సైద్ధాంతిక భూమిక జోడించిన విప్లవ నేత కామ్రేడ్ లెనిన్ అన్నారు.

భారతదేశంలో 1925లో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిందన్నారు. ఎం.నరేందర్ మాట్లాడుతూ.. 1969 ఏప్రిల్ 22న రివిజనిజం మీద పార్లమెంటరీ పంథాకు వ్యతిరేకంగా విప్లవకారులు ఒక పార్టీగా సిపిఐ (ఎంఎల్)ను ఏర్పాటు చేసుకున్నరోజన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న, జిల్లా నాయకులు డి.రాజేశ్వర్, డివిజన్ నాయకులు కిషన్, మురళి, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గణేష్, పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా, వివిధ ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భారతదేశంలో కామ్రేడ్ లెనిన్ ఉద్యమ స్ఫూర్తితో కార్మికరాజ్య స్థాపన కోసం కృషి చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ నగరంలో కోటగల్లి నీలం రామచంద్రయ్య భవన్ ముందు ఆకుల పాపయ్య జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లెనిన్ రష్యాలో కార్మిక రాజ్య స్థాపన కోసం ప్రజలందరినీ ఏకం చేశాడని, నేడు దేశంలో సంపద కొద్దిమంది చేతుల్లోకి వెళ్తుందని ఆయన తెలిపారు. సంపద కొద్దిమంది దగ్గర కేంద్రీకృతమైందని, పాలకులు భారతదేశ వనరులు సామ్రాజ్యవాద దేశాలకు అప్పగిస్తూ విదేశీ జపం చేస్తున్నారన్నారు. నేడు దేశంలో కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలను మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిందని, నిరుద్యోగం పెరిగిపోయిందని నిత్యవసరాలు ధరలు ఆకాశాన్ని అంటాయని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నిజామాబాద్ నగర కార్యదర్శి నీలం సాయిబాబా, మక్లూరు మండల కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి, మోపాల్ మండల కార్యదర్శి బండమీద నర్సయ్య, డిచ్‌పల్లి కార్యదర్శి జెపి గంగాధర్, పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ, న్యూడెమోక్రసీ నాయకులు పరుచూరి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో
పనులు సకాలంలో పూర్తిచేయాలి


డిచ్‌పల్లి : మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి చక్రవర్తి తరుణ్ కుమార్, డిస్ట్రిక్ట్ లేబర్ ఆఫీసర్, మండల ప్రత్యేక అధికారి యోహన్, ఎంపిడిఓ రవీందర్‌తో కలసి సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా జరుగుతున్న పనుల పురోగతిపై వారు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో తాగు నీరు, గ్రామాల్లో పారిశుధ్యం అంశాలపైన సమీక్ష సమావేశం నిర్వహించా రు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు సకాలంలో త్వరగా పూర్తి చేయ్యలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బంది రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా జరగాలని వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి రాజ గంగారం, పిఆర్ ఎఇ. శ్రీధర్, అన్ని గ్రామాల స్పెషల్ అధికారులు, పంచాయతి కార్యదర్శులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : మండలంలోని గన్యా తండా గ్రామపంచాయతీ పరిధిలోని నూర్ సింగ్ తండాలో ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కన్వీనర్, ప్రధానోపాధ్యాయుడు అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు విధులు నిధులు తెలియజేస్తూ.. కమిటీ మెంబర్ల విధులు తెలియజేస్తూ సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పుప్పాల పల్లి గ్రామ సంఘం అధ్యక్షురాలు వివోఏ కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శోభాయాత్రకు ఆటంకం లేకుండా చెట్ల కొమ్మల తొలగింపు


చెట్ల కొమ్మలను తొలగిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వీర హనుమాన్ విజయా యాత్ర జరిగే రోడ్డులో ర్యాలీకి ఎటువంటి ఆటంకం కలగకుండా ర్యాలీకి చెట్ల కొమ్మలు అడ్డంగా వచ్చే చోట తొలగిస్తున్నారు. నిజామాబాద్ మున్సిపల్ సిబ్బంది నగరంలోని నీలకంఠేశ్వర ఆలయం నుండి జడ్పీ ఆఫీస్, నాందేవాడ, శివాజీ చౌక్, దేవీ రోడ్డు, గాంధీ చౌక్, పెద్దబాజర్, ఆర్ఆర్ చౌరస్తా రోడ్డులో గల చెట్ల కొమ్మలను తొలగిస్తున్నారు.

పార్లమెట్ అభ్యర్థిగా అశోక్ నేత నామినేషన్


నామినేషన్‌ను స్వీకరిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ (ఎంటిఆర్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు పోతు అశోక్ నేత నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ లో తన నామినేషన్ పత్రాలను జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు అందజేశారు. పద్మశాలి కులానికి చెందిన పోతు అశోక్ నేత 2018లో మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీని స్థాపించారు. 2020-21వ సంవత్సరంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో తన పార్టీ తరపున అభ్యర్థులను బరిలో నిలిపారు. గత సంవత్సరం జరిగిన శాసనసభ ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్‌పై నామినేషన్ వేసి ఐదో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ తరపున ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఇప్పటి వరకు ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు తెలిపారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ జిల్లా అధ్యక్షులు మంతెన బాజా గౌడ్, నాయకులు అంకం శ్రీనివాస్, పోలపల్లి సాయికుమార్, పోతు నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

శ్రామిక రాజ్య సాధనకు పోరాడుదాం


మాట్లాడుతున్న సీపిఐఎంఎల్ డెమోక్రసీ సహాయ కార్యదర్శి దాసు

నవతెలంగాణ-ఆర్మూర్

శ్రామిక రాజ్య సాధనకై పార్టీ ఆవిర్భావ దినోత్సవం స్ఫూర్తితో పోరాడుదామని సిపిఐఎంఎల్‌ను డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. పార్టీ 55వ ఆవిర్భావ దినోత్సవం, లెనిన్ 154వ జయంతిని పునస్కరించుకొని న్యూ డెమోక్రసీ ఆఫీస్ వద్ద సోమవారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మతోన్మాదం, శ్రమ దోపిడీ తీవ్రమైందని, కష్టజీవులను ఐక్యంగా కదిలించడంలో విప్లవ కమ్యూనిస్టు పార్టీలు వెనుకబడడం విచారకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భాగ్యవంతమైన దేశాన్ని అప్పుల కొంపగా, ఆకలి, అసమానతలకు నిలయంగా పాలకవర్గ పార్టీలు మార్చాయని ఆయన అన్నారు. ప్రపంచ ఆకలి సూచీలో మన దేశం 111 స్థానంలో ఉందని, పోషకాహార లోపంతో కోటీ 70 లక్షల మంది మరణించడమే కాకుండా, 9 సంవత్సరాల నరేంద్ర మోడీ పాలనలో లక్ష 500 మంది ఆత్మహత్యలతో ప్రాణాలు కోల్పోయారని ఆయన తెలిపారు. వ్యవసాయం పారిశ్రామిక రంగం ప్రమాదంలో నెట్టబడుతుందని, కార్పొరేట్ అధిపతులకు 25 లక్షల రుణమాఫీ చేసి, మోడీ ఏటా రెండు కోట్ల కొలువుల హామీను విస్మరించి, 23 కోట్ల మంది కటిక పేదరికంలో ఉండేటట్లు వివరించాడని ఆక్సాం నివేదిక వెల్లడించిందని ఆయన తెలిపారు. ఎన్నికల వాగ్దానాలు బిజెపి గాలికివదిలి, మతం పేరుతో ప్రజల్ని రెచ్చగొట్టడం చేస్తుందని ఆయన అన్నారు. దేశంలో మెజార్టీ హిందువులు మోడీ ప్రజా వ్యతిరేక విధానాలతో బజారు పాలు అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. పీడిత ప్రజలను కూడగట్టి, శ్రామిక రాజ్య సాధనకై ఐక్య పోరాటా లను నిర్మిద్దామని దాసు పిలుపును ఇచ్చారు. ఈ సభలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి బి.సూర్యశివాజీ, పార్టీ ప్రజా సంఘాల నాయకులు ఎండి కాజా మొయినుద్దీన్, రవి, ప్రిన్స్, లక్ష్మక్క, ధనలక్ష్మి, చరణ్, పాషా బాయ్, లోకేష్, నిశాంత్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బీమా సౌకర్యం కల్పించాలి

- 200 రోజులు పనిని కల్పించాలి


కూలీలతో మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఉపాధి కూలీలకు బీమా సౌకర్యం కల్పించాలని, ఉపాధి కార్డు ఉన్న కూలీలందరికీ సంవత్సరానికి 200 రోజులు పనిని కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు అన్నారు. మండలంలోని బట్టాపూర్, తడపాకల్, తాళ్ళ రాంపూర్ గ్రామాలకు చెందిన ఉపాధిహామీ కూలీలను అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కిషన్, సీఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా ఆర్మూర్ డివిజన్ నాయకులు బి.అశోక్ ఉపాధిహామి జరుగుతున్న పని ప్రదేశంలో కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కూలీలకు ఇస్తున్న 300 రూపాయల రోజు వారీ కూలీ కాకుండా ప్రతి మనిషికి 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంవత్సరంలో 200 రోజులు పనిని కల్పించాలని, అనుకోకుండా కూలీలకు ఏదైనా ప్రమాదం జరిగితే 5 లక్షల రూపాయల ప్రమాద బీమా అందించాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు నెలకు 20 వేల వేతనం, మేట్లకు 10 రూపాయల వేతనం అందించాలని అన్నారు. బడ్జెట్ పెంచి కూలీలకు గడ్డపారలు, తట్టలు, పారలు సమకూర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సభ్యులు సత్తెక్క, లక్ష్మక్క, జమున, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నేడు వరి పంటలో నేరుగా వెదజల్లే పద్ధతిపై అవగాహన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మంగళవారం ఉదయం 9:30 గంటలకు మండలంలోని మెంట్రాజ్ పల్లి రైతు వేదికలో వరి పంటలో నేరుగా వెదజల్లే పద్ధతి, మామిడి సాగులో నాణ్యతను పెంపొందించుటకు పాటించవలసిన సూచనలపై అవగాహన కల్పిస్తున్నట్టు మండల వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుండి శాస్త్రవేత్తలు శ్రవణ దృశ్య మాద్యమం ద్వారా రైతు సోదరులకు అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతు సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నవతెలంగాణ
3
కామారెడ్డి
మంగళవారం | ఏప్రిల్ 23, 2024 | www.navatelangana.com

హంగర్గఫారంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలోని హంగర్గాఫారం గ్రామంలో అంబేద్కర్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు పుప్పాల శంకర్, గ్రామ దళిత సంఘం, గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ జయంతి వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు

సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం ఉదయం సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్టాపన వేదమంత్రాలతో నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ చంద్రకళ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విగ్రహ ఏర్పాటుకు కృషిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. విగ్రహ దాత మనకోసం మనం ఫౌండేషన్ కిషోర్ కుమార్ ఇచ్చినట్టు ఆమె వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి దేవిసింగ్, ఉపాధ్యాయ బందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న పాఠశాల సిబ్బంది

ఎండలోనే నిరీక్షణ

- కోటగిరిలో బస్టాండ్ ఉన్నా.. నిరుపయోగం
- అపరిశుభ్రంగా ఉండటంతో రోడ్డుపై నిరీక్షిస్తున్న ప్రయాణికులు
- ప్రయాణికుల బాధలు తీరేదెన్నడో..?

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలో ప్రయాణికుల బాధలు వర్ణణాతీతంగా మారాయి. పాలకులు మారుతున్నా.. ప్రయాణికులకు బాధలు మాత్రం తప్పడం లేదు. కోటగిరి మండల కేంద్రం నుంచి నిత్యం బోధన్, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు వేల సంఖ్యలో ప్రయాణికులు వెళుతుంటారు. వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. అయితే ప్రధానంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికోసం బస్టాండ్ నిరుపయోగంగా మారడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రయాణికులకు నిలువ నీడ లేక, ఎవరికీ చెప్పుకోలేక అవస్థలు పడుతున్నారు.


అంబేద్కర్ చౌరస్తాలో ప్రయాణికుల నిరీక్షణ

పాత బస్టాండ్ అంబేద్కర్ చౌరస్తాలో ఉన్నప్పటికీ అపరిశుభ్రంగా మారింది. ప్రయాణికులకు నిలువ నీడ లేదు. దాంతో బస్టాండ్‌కు ప్రయాణికులు ఎవరూ వెళ్లడం లేదు. బస్సుల కోసం, ఇతర వాహనాల కోసం బస్టాండ్ పక్కన గల రోడ్డుపై నిలిచి ఉంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో మహిళ ప్రయాణికుల సంఖ్య పెరిగింది. దీంతో బస్సుల కోసం రోడ్డుపైనే నిరీక్షించాల్సి వస్తోంది. అలాగే విద్యార్థులు చదువు కోసం రాకపోకలు నిత్యం సాగిస్తుంటారు. వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

కొత్త బస్టాండ్ శిథిలావస్థకు చేరుకోవడం, ప్రయాణికులకు నిలబడలేక కష్టాలు పడుతున్నారు. నిత్యం పాత బస్టాండ్ నుంచి ఎక్కువగా ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. వివిధ కార్యక్రమాలకు వ్యాపార నిమిత్తం ప్రజలు కోటగిరి వస్తుంటారు. అయితే బస్సుల కోసం నిరీక్షిస్తున్న సమయంలో ఎండకు తాళలేక పక్కనున్న దుకాణాలలో వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వృద్ధకళాకారులు తమ లైఫ్ సర్టిఫికెట్‌లను ఈ నెల 25లోగా అందజేయలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలో వద్ధాప్య కాళాకారుల పింఛను పొందుతున్న వద్ధకళాకారులు తమ లైఫ్ సర్టిఫికెట్లను ఈ నెల 25లోగా అందజేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం తెలిపారు. పింఛన్ పొందుతున్న వద్ధ కళాకారులు ప్రతి ఏటా డిసెంబర్ మాసంలో జీవించి ఉన్నట్లు లైఫ్ సర్టిఫికెట్‌ను సమర్పించవలసి ఉంటుందని పేర్కొన్నారు. కాగా ఇప్పటి వరకు సమర్పించని వద్ధ కళాకారులు ఈ నెల 25 లోగా కలెక్టరేట్‌లోని జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో సమర్పించాలని ఆయన సూచించారు. ఈ లైఫ్ సర్టిఫికెట్‌లను సాంస్కృతిక సంచాలకుల వారికి పంపవలసి ఉంటుందని, వెంటనే లైఫ్ సర్టిఫికెట్‌తో పాటు, బ్యాంకు ఖాతా నెంబర్ జిరాక్స్ ప్రతిని కూడా సమర్పించాలని ఆయన సూచించారు.

జహీరాబాద్ బిజెపి ఎంపీ అభ్యర్థిగా బీబీ పాటిల్ నామినేషన్


నామినేషన్ వేస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్

నవతెలంగాణ-మద్నూర్/జుక్కల్

మద్నూర్ ఉమ్మడి మండల నివాసుడు ప్రస్తుత జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, బిజెపి ఎంపీ అభ్యర్థిగా సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో తమ నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సోమవారం అందజేశారు. నామినేషన్ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ బిజెపి పార్టీ ఎన్నికల ఇంచార్జ్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, కామారెడ్డి బిజెపి జిల్లా అధ్యక్షురాలు, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే అరుణతార, సంగారెడ్డి బిజెపి జిల్లా అధ్యక్షులు అంజిరెడ్డి, ముఖ్య నాయకులు బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి సభకు తరలిన కాంగ్రెస్ పార్టీ నాయకులు


సీఎం సభకు తరలిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-బోధన్

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మహాసభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవగా.. సభ విజయవంతం కోసం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. అందులో భాగంగా సాలూర మండల కేంద్రం నుంచి వందల మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వాహనాలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహాసభకు తరలివెళ్లారు. మహాసభకు వెళ్లిన వారిలో నాయకులు బుద్దె రాజేశ్వర్, సొసైటీ చైర్మన్ జనార్ధన్, అల్లె రమేష్, ఇల్తెపు రమేష్, బుయ్యన్ సురేష్, రావుల లక్ష్మణ్, సరిదే సాయిలు, కన్నె భీమయ్య, బచ్చు సాయిలు, శంకర్, కన్నే రమేష్, మల్లేష్ తదితరులున్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం


వైద్యశిబిరంలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని ధన్నూర్ గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో షుగర్ పరీక్షలు, దంత పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శశికుమార్, ప్రమోద్, రెడ్‌క్రాస్ సొసైటీ డివిజన్ వైస్ చైర్మన్ డాక్టర్ విక్రమ్ కుమార్, జిల్లా కోశాధికారి దస్తీరాం, మద్నూర్ మండల చైర్మన్ ప్రకాష్, దన్నూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎడపల్లి సహకార సంఘం డైరెక్టర్


కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కండువా వేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని వడ్డెపల్లి గ్రామానికి చెందిన ఎడపల్లి సహకార సంఘం డైరెక్టర్ రాములు నాయక్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇటీవల ఎడపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి సమక్షంలో రాములు నాయక్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు వారు పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. కార్యక్రమంలో పులి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బిల్లా రామ్మోహన్‌రావు, జెడ్పి ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య, ఆత్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుందలో కళాకారునికి సన్మానం

నవతెలంగాణ-బిచ్కుంద

కళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రచ్చ జగన్నాథ్ స్మృతి సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన సూక్ష్మ చిత్ర కళాకారుడు బాసబాలును బిచ్కుంద ఎస్సై మోహన్‌రెడ్డి శాలువా, మెమెంటో, ప్రశంసాపత్రంతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్సై మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బాలు ఎన్నో సూక్ష్మ చిత్ర కళలు ఆవిష్కరించి తన కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారన్నారు. తన కళను విద్యార్థులకు శిక్షణ రూపంలో అందజేసి సూక్ష్మ చిత్ర కళాకారులను తయారు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రచ్చ శివకాంత్, ఉపాధ్యాయులు సందీప్, విద్యార్థులు వారి తల్లిదండ్రులున్నారు.


కళాకారుని సన్మానిస్తున్న ఎస్సై

కుర్లాలో పెండ్లికి హాజరైన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

డోంగ్లి మండలంలోని కుర్ల గ్రామంలో పీరుగొండ కూతురి వివాహానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బంధుమిత్రులు పాల్గొన్నారు.


పెండ్లికి హాజరైన ఎమ్మెల్యే

తూకంలో ఎలాంటి తేడా రావొద్దు

- జిల్లా అదనపు కలెక్టర్ చంద్ర మోహన్

నవతెలంగాణ-కామారెడ్డి

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలని, తూకంలో ఎలాంటి తేడా రాకూడదని జిల్లా అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ కొనుగోలు కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. సోమవారం కామారెడ్డి మండలం క్యాసంపల్లిలోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించారు. ప్రమాణాలకు లోబడి ఉండడంపట్ల సంతప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోళ్ల ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని, తరుగు తీయవద్దని, తూకం వేసిన వెంటనే ధాన్యాన్ని కేటాయించిన మిల్లులకు తరలించాలన్నారు. మిల్లు యజమానులు కూడా హమాలీలను అధిక సంఖ్యలో పెట్టుకొని లారీలు వచ్చిన వెంటనే ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకొని ట్రక్ షీట్ అకనాలెడ్జ్మెంట్ జారీచేయాలని అన్నారు. తరుగు తీసి రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ శరవేగంగా సాగుతున్నదని అన్నారు. 350 కొనుగోళ్ల కేంద్రాల లక్ష్యానికి గాను ఇప్పటి వరకు 241 కేంద్రాల ద్వారా 11,723 మంది రైతులకు చెందిన 161 కోట్ల 70 లక్షల విలువగల 73,400 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలో 55 కోట్ల 27 లక్షలు వేశామని అన్నారు. ఇదే రోజు గత ఏడాది రబీ సీజనులో కేవలం 13,107 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశామని, దీనితో పోలిస్తే ఈ యాసంగి సీజనులో 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం అధికంగా కొనుగోలు చేశామని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటూ రోజువారి సమీక్షిస్తున్నదని అన్నారు. రైతులు నష్టపోకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే బైల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామని చంద్రమోహన్ తెలిపారు. రైతులు కూడా 17 శాతం తేమ మించకుండా, తాళ్లు లేకుండా ఎఫ్.ఏ.క్యూ ప్రమాణాల మేరకు ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. అకాల వర్షాల పట్ల అప్రమత్తం ఉంటూ ధాన్యం తడవకుండా ఎత్తు పల్లాలపై ఉంచుకొని, టార్పాలిన్లు కప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ నిత్యానందం, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి

- జహీరాబాద్ పార్లమెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-మద్నూర్

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని జహీరాబాద్ పార్లమెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికలపై సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, సెక్టోరల్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జహీరాబాద్ పార్లమెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలు సజావుగా నిర్వహిస్తే ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగే విధంగా ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు సక్రమంగా నిర్వర్తించి ఎన్నికలు సజావుగా సాగేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి డి. శ్రీనివాస్ రెడ్డి

ఆయా మండలాల పరిధిలో ఉన్న తహసీల్దార్లు, సెక్టోరియల్ అధికారులు, బూత్ లెవెల్ అధికారులతో సమన్వయం చేసుకొని ఒక్కో సెక్టార్‌కు ఉన్న పోలింగ్‌స్టేషన్‌లు, సౌకర్యాలు, ఎన్నికల నిర్వహణపై ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని వాటికి సన్నద్ధం కావాలని సూచిస్తూ ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో మద్నూర్ తహసీల్దార్ ఎండి ముజీబ్, బిచ్కుంద తహసీల్దార్ సురేష్, పిట్లం తహసీల్దార్ వేణు, నిజాంసాగర్ తహసీల్దార్ బిక్షపతి, డోంగ్లి తహసీల్దార్ రేణుక, పెద్దకొడప్‌గల్ తహసీల్దార్ దశరథం, మద్నూర్ డిప్యూటీ తహసీల్దార్ భరత్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ విజయ్, గిర్ధవార్ శంకర్, సర్వేయర్లు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

వికలాంగులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-కామారెడ్డి

వికలాంగులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్ప దుర్గాప్రసాద్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 13వ తేది పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కేంద్ర ఎన్నికల కమిషన్ దివ్యాంగుల కోసం ప్రత్యేక చొరవ తీసుకుని ఉచిత రవాణా సౌకర్యం కల్పించి ప్రత్యేక ఏర్పాట్లతో దివ్యాంగుల ఓటు హక్కు వినియోగించుకోనేలా చూడటం దేశ చరిత్రలో 10 సంవత్సరాలుగా ఇలాంటి వెసులుబాటు కల్పించిందని తెలిపారు. కావున నిర్లక్ష్యం చేయకుండా మనం వేసే ఓటు మన సంక్షేమం కోసం వేయాలని కోరారు. అప్పుడే ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు మన సంక్షేమ హక్కులు సాధించేందుకు ఆయుధంగా మార్చుకునేలా ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా మీకు నచ్చిన వారికి ఓటు వేయడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని తెలిపారు. కార్యక్రమంలో సబ్ కమిటీ చైర్మన్ పంగ ఈశ్వర్, జిల్లా అధ్యక్షులు గాడి నర్సింలు, నాయకులు బంటు స్వామి, బంజ రాజు తదితరులు పాల్గొన్నారు.



దోపిడీ రహిత సమాజం కోసం పోరాడుదాం

నవతెలంగాణ-బోధన్

అసమానతలు లేని, దోపిడీ రహిత సమాజం కోసం కామ్రేడ్ లెనిన్ స్ఫూర్తితో పోరాడుదామని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా బోధన్ సబ్ డివిజన్ కార్యదర్శి మల్లేష్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలో కామ్రేడ్ లెనిన్ 154వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెట్టుబడిదారి సమాజమే శాశ్వతమైందని, పెట్టుబడిదారి సిద్ధాంతకర్తలు బోధిస్తే, రెక్కలు తప్ప ఎలాంటి ఆస్తులు లేని శ్రామికులు విప్లవానికి నాయకత్వం వహించి, ఆకలి, పేదరికం, మతం, జాతి, వర్ణం, దోపిడీ లేని, సమ సమాజాన్ని నిర్మిస్తారని అన్నారు. మార్క్సిస్టు మహోపాధ్యాయులు మార్క్స్ చెప్పింది నిజమని అన్నారు. మార్క్సిజాన్ని రష్యా దేశ పరిస్థితులకు అన్వయించి ప్రపంచంలో మొట్టమొదటిసారి రష్యాలో 1917 అక్టోబర్ విప్లవాన్ని విజయవంతం చేసి నిరూపించిన మహోన్నత వ్యక్తి కామ్రేడ్ లెనిన్ అని కొనియాడారు. వలస - అర్ధ వలస ఫ్యూడల్-అర్ధ ఫ్యూడల్ దేశాలైన చైనా, ఇండియా తదితర దేశాలకు మార్క్సిజాన్ని తగిన విధంగా మార్గదర్శకం చేశారని రష్యా చైనా ఇండియాలలో విప్లవాలు విజయవంతం అయితే ప్రపంచ విముక్తికి మార్గం సుముగం అవుతుందని చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పడాల శంకర్, సహాయ కార్యదర్శి సుల్తాన్ సాయిలు, తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్(ఐ ఎఫ్ టి యూ) రామ లక్ష్మణ్, ధ్యాకం పోశెట్టి, శంకర్, ఎండి.ఫారూఖ్, బాలాజీ, కోనేటి శంకర్, ఇమ్రాన్, ఎస్ కే.అబ్లీ,సాయిలు, శంభు, బుజ్జి, పోశెట్టి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దు

- ఎన్.సి.డి ప్రోగ్రాం అధికారి డాక్టర్ శిరీష



మాట్లాడుతున్న ఎన్.సి.డి ప్రోగ్రాం అధికారి డాక్టర్ శిరీష

నవతెలంగాణ-కామారెడ్డి

విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దని ఎన్.సి.డి ప్రోగ్రాం అధికారి డాక్టర్ శిరీష అన్నారు. కామారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఎన్.సి.డి ప్రోగ్రాం ద్వారా జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. త్వరలో విడుదల కాబోయే తెలంగాణ రాష్ట్ర పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల నేపథ్యంలో విద్యార్థులు ఎవరూ మానసిక ఒత్తిడికి గురికావొద్దని సూచించారు. పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని, తక్కువ మార్కులు వచ్చాయని నిరాశ నిస్పృహలకు లోనై విద్యార్థులు ఆత్మహత్య ప్రేరేపిత ఆలోచనలకు లోనుకావొద్దని అన్నారు. మానసిక ఆందోళనలు తలెత్తితే ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ 14416ను సంప్రదించి కౌన్సెలింగ్ పొందాలని లేదా దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులను సంప్రదించాలని తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థులను ఎప్పటికప్పుడు గమనిస్తూ పిల్లలెవ్వరూ కూడా మానసిక సమస్యలకు గురికాకుండా చూసుకోవాలని ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
మంగళవారం | ఏప్రిల్ 23, 2024 | www.navatelangana.com

గ్రామగ్రామాన కాంగ్రెస్ పార్టీ ప్రచారం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం జోరుగా కొనసాగుతున్నది. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న లోక్ సభ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామగ్రామాన జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మణ్, బోయిని హనుమాన్లు, సాయగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మన్నే వెంకటి, షకీల్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహనీయుల జయంతి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 30న మహనీయుల జయంతి ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఉత్సవాల కమిటీ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కు కలిసి కరపత్రం అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. బహుజన జాతి ఉద్ధరణకు తమ అమూల్యమైన సమయం కేటాయించి సందేశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జాంబిగే హన్మాండ్లు, బొడ్ల రాజు, కృష్ణ రెడ్డి, రవి, బాలరాజ్, అఫ్రోజ్, సంజీవ్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న కమిటీ సభ్యులు

నేడు వీర హనుమాన్ విజయయాత్ర

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నేడు వీర హనుమాన్ విజయా యాత్ర విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు అన్నారు. వీర హనుమాన్ విజయా యాత్ర నగరంలోని కంటేశ్వర్ ప్రాంతంలో గల శ్రీ నీలకంఠేశ్వర ఆలయం వద్ద నుంచి మంగళవారం ఉదయం 9గంటలకు శోభాయాత్ర ప్రారంభమై జడ్పీఆఫీస్, నాందేవాడ మీదుగా శివాజీ చౌక్ నుంచి దేవీ రోడ్డు మీదుగా గాంధీచౌక్, పెద్దబజార్ మీదుగా ఆర్ఆర్‌చౌరస్తా చేరుకొని అక్కడ భారీ బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు. ఈ శోభాయాత్రకు ఎక్కువ సంఖ్యలో ప్రజలు హాజరు కావాలని కోరారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వీల్‌చైర్ వితరణ



వీల్‌చైర్ అందజేస్తున్న రోటరీ క్లబ్‌వారు

నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వీల్‌చైర్ అందజేత. పట్టణంలోని చేనేత కాలనీలో నివసిస్తున్న సహస్ర వారి తండ్రి భూమేశ్వర్ అనారోగ్యంతో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నడవలేని స్థితిలో ఉన్నారు. వారి అవసర నిమిత్తం రూ.12000 విలువగల "వీల్‌చేర్"ను వారి కుటుంబ సభ్యులకు గిరిరాజ్ కళాశాల అధ్యాపకుడు వివేకానంద్ స్పందించి వారి కూతుర్లకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పట్వారి గోపి కృష్ణ మాట్లాడుతూ.. మాకు వచ్చిన సమాచారం ఆధారంగా వెంటనే స్పందించి మా రోటరీ సేవలను చూసి తమ వంతు సహాయం అందిస్తానని ముందుకు వచ్చిన అధ్యాపకుడు వివేకానంద్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి పట్వారి తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్కిడ్స్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థికి కన్వోకేషన్ సర్టిఫికెట్ అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్కిడ్స్ పాఠశాలలో సోమవారం గ్రాజియేషన్ డే కార్యక్రమాలను పాఠశాల చైర్మన్, ప్రిన్సిపల్, సిహెచ్ గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేడుక కేవలం విద్య విశయక విజయాల వేడుక మాత్రమే కాదు నేర్చుకోవడం, వృద్ధికి సంబంధించిన కొత్త అధ్యయనం అని అన్నారు. ఈ వేడుకలో భాగంగా యూకేజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు యాజమాన్యం చేతుల మీదుగా కన్వోకేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్కే గ్రూప్ ఆఫ్ సీఈవో ఎం. జైపాల్‌రెడ్డి, డైరెక్టర్ సదాశివరెడ్డి, ఆర్కే డిన్ నవీన్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని పేట్ సంఘం గ్రామంలో ఆదివారం రాత్రి 9:30 గంటలకు సమయంలో పేట్ సంఘం గ్రామానికి చెందిన ఒకరు మృతిచెందారు. ఎస్సై ఆంజనేయులు వివరాల ప్రకారం.. సాలె కిషన్ (50) బహిర్భూమికై ఇంటి దగ్గరలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. వెనుక నుంచి షెట్పల్లి గ్రామానికి చెందిన బైక్ నడుపుతున్న కిస్టు పోశయ్య వెనకనుంచి ఢీకొన్నాడు. ఈప్రమాదంలో సాలెకిషన్‌కు తలకు చేతులు, కాళ్ళకి తీవ్ర రక్త గాయాలు కాగా వెంటనే 108లో నిజామాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి వేరే ఆసుపత్రికి వెళ్తుండగా సోమవారం మృతిచెందాడు. మృతుని భార్య సాలే గంగమని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.



మృతి చెందిన కిషన్

మేనూర్ మహాదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు

- ముఖ్య అతిథిగా హాజరైన హరీష్ షిండేకు సన్మానం



సన్మానించిన పలువురు

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని మేనూరు గ్రామంలో గల మహాదేవుని ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆ గ్రామ ప్రముఖులు వై.గోవింద ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్దఎత్తున చేపట్టారు. ఈ కార్యక్రమానికి జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్‌షిండే కుమారుడు, బీఆర్ఎస్ పార్టీ జుక్కల్ నియోజకవర్గ యువ నాయకులు హరీష్ షిండే ముఖ్య అతిథిగా హాజరుకాగా ఆయనకు శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

నాలుగోరోజు 12 నామినేషన్లు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నాలుగోరోజు 12 నామినేషన్లు దాఖలు అయ్యాయి. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి సోమవారం 12 నామినేషన్లు దాఖలు అయ్యాయని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఇప్పటికే స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన సయ్యద్ అస్గర్ సోమవారం రెండవ సెట్ నామినేషన్ పత్రాలు అందజేశారన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్ మూడవ సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారని వివరించారు. బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థిగా దేవతి శ్రీనివాస్ కూడా మూడవ సెట్ నామినేషన్ పత్రాలు అందించారని, భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా అరవింద్ ధర్మపురి రెండవ సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారని తెలిపారు. వీరితో పాటు అలయెన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా యుగంధర్ గట్ల, మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ అభ్యర్థిగా పోతు అశోక్ నామినేషన్లు వేశారని వివరించారు. ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా కండెల సుమన్, స్వతంత్ర అభ్యర్థిగా ఆర్.రాజేందర్, రాపెల్లి శ్రీనివాస్‌లు రెండవ సెట్ చొప్పున నామినేషన్లు వేశారఅన్నారు. నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విట్టల్ మలావత్, స్వతంత్ర అభ్యర్థిగా కాత్రాజి ప్రశాంత్, యుగ తులసి పార్టీ అభ్యర్థిగా కోటగిరి శ్రీనివాస్ నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు. నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ స్థానానికి ఇప్పటివరకు మొత్తం 28 నామినేషన్లు దాఖలు అయ్యాయని రిటర్నింగ్ అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు.



నామినేషన్‌ను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

ప్రైవేటు విద్యాసంస్థల చేతిలో

తెలంగాణ ఇంటర్ బోర్డు కీలుబొమ్మ

- నిద్రమత్తులో తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల చేతిలో తెలంగాణ ఇంటర్ బోర్డు కీలుబొమ్మలా మారిందని టిఎస్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు సచిన్‌పటేల్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా ప్రచారాలు నిర్వహిస్తూ, అడ్మిషన్లు చేపడుతున్న ప్రైవేట్‌కార్పొరేట్ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ టిఎస్ఎస్ఎఫ్ తరపున టిఎస్ఎస్ఎఫ్ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సచిన్ పటేల్ డిమాండ్ చేశారు. సోమవారం టిడిపి పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రైవేటు కార్పొరేట్ కళాశాలలు ఇప్పటికే అడ్మిషన్లు చేపడుతున్నాయని, దీనిపైన ఇంటర్ బోర్డు సంబంధిత అధికారుల దృష్టికి వచ్చిన చూసి చూసినట్టు వ్యవహరిస్తున్నారన్నారు. ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం మొదటి సంవత్సరానికి రూ.1,760, రెండవ సంవత్సరానికి రూ.1,940 మాత్రమే ఫీజు వసూలు చేయాలని స్పష్టమైన గైడ్లెన్స్ ఉన్న, ఇవేవీ పట్టించుకోకుండా ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు భారీగా లక్షల్లో ఫీజులు పెంచి, విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. జూనియర్ కళాశాలలను ఐఐటి, నీట్, జెఈఈ అకాడమీలుగా మార్చి లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని మోపుతున్న సంబంధిత అధికారులు స్పందించడం లేదని మండిపడ్డారు. జిల్లాలో ఉన్న ఇంటర్మీడియట్ అధికారులు కళాశాలలను తనిఖీ చేయకుండా పరోక్షంగా ప్రైవేటు కార్పొరేట్ కళాశాలకు అనుకూలంగా వారికి సహకరించే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. తెలంగాణ ఏర్పడిన నుంచి ఇంటర్మీడియట్ బోర్డును ప్రక్షాళన చేయకపోవడంతో ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలల ఆగడాలు మితిమీరి పోతున్నాయని, దీనిపైన నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఇంటర్‌బోర్డును ప్రక్షాళన చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని సచిన్‌పటేల్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ పట్టణ టిఎస్ఎస్ఎఫ్ అధ్యక్షులు వెంకట్, టిఎస్ఎస్ఎఫ్ నాయకులు లోకేష్, జేమ్స్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిఎస్ఎస్ఎఫ్ నాయకులు

డబుల్ ఇండ్ల బిల్లులు కాజేసిన బీనామీలు

- కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జి

నవతెలంగాణ-వర్ని

డబుల్ బెడ్ రూమ్‌ల బిల్లులు లబ్దిదారులకు ఒకటి నుంచి మూడు వరకు బిల్లులు చెల్లించకుండా పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాంట్రాక్టర్లు, తన బినామీలు తినేశారని కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి విమర్శించారు. సోమవారం వర్ని మండల కేంద్రంలోని విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోచారం శ్రీనివాస్‌రెడ్డి బిల్లులు చెల్లించామని మాయమాటలు చెబుతున్నారని అన్నారు. గ్రామాలలో పర్యటిస్తే ఒక్కొక్క గ్రామంలో లబ్దిదారులకు మూడు బిల్లులు ఇవ్వకుండా నా ప్రాణం ఇస్తా.. అది ఇస్తా.. అనటం కాదు.. ముందు బిల్లులు చెల్లించు లేనిపక్షంలో లోక్‌సభ ఎన్నికల అనంతరం నేనే స్వయంగా అధికారులతో మాట్లాడుతానని అన్నారు. గ్రామాల్లో ఒక్కొక్క అధికారిని నియమించి ఎక్కడైతే డబుల్ బెడ్రూం ఇండ్ల బిల్లుల్లో మోసం జరిగిందో అక్కడ వారి పోచారం అనుచరుల నుంచి వసూలు చేయించి పేదలకు అందించేలా చూస్తానని ఆయన అన్నారు.. ఎవర్ని వదిలిపెట్టేది లేదని, డబుల్ బెడ్రూంలో పేర్లతో కోట్ల రూపాయలు పోచారం తన బినామీలు మింగేసారని ఆయన విమర్శించారు. ఎవరికైతే బిల్లులు రాలేవో తానే దగ్గరుండి బిల్లులు ఇచ్చేలా చూస్తానని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు ఎలమంచిలి శ్రీనివాస్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బద్యానాయక్ మేక వీర్రాజు సురేష్ బాబా గంగప్ప గంగ ప్రసాద్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి

పోచారం శ్రీనివాస్‌రెడ్డి గురించి మాట్లాడే అర్హత లేదు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-వర్ని

బాన్సువాడ నియోజకవర్గంలో 1500 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పేదలకు ఇచ్చిన ఏమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జి ఏనుగు రవీందర్ రెడ్డికి లేదని బీఆర్ఎస్ పార్టీ శ్రీనగర్ మాజీ సర్పంచ్ రాజు అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుచరుల గురించి మాట్లాడితే సహింహిచేది లేదని హెచ్చ రించారు. నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూం ఇండ్లలో నివసించె ప్రజలను అడగండి.. లేదంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు కంటి అద్దాలు పెట్టుకొని చూడండి.. అని అన్నారు. ఇలా ఒకే రోజు రెండు పార్టీల నాయకులు మాటల తుటాలు పేల్చుకున్నారు. సమావేశంలో గోపాల్, గిరి నామాల సాయిబాబా వైస్ ఎంపీపీ దండ్ల బాలరాజు తదితరులు ఉన్నారు.

శోభాయాత్రను శాంతియుతంగా నిర్వహించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

హన్‌మాన్ శోభాయాత్రను శాంతియుతంగా నిర్వహించేందుకు 1200 మంది సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు పోలీస్ కమిషనర్ సోమవారం తెలిపారు. నిజామాబాద్ కమీషనరేటు పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిదిలోని ఈ నెల 23న నిర్వహించే హనుమాన్ జయంతి, శోభాయాత్ర అన్నదాన కార్యక్రమాలు శాంతియుతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఇందుకోసం నిజామాబాద్, కామారెడ్డి, సిద్దిపేట్, ములుగు జిల్లాల నుండి పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వాహణ కోసం దాదాపు 1200 మందితో ఏర్పాట్లు చేశామని అన్నారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలో హన్మాన్ శోభాయాత్ర సందర్బంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా శోభాయాత్ర ప్రారంభం నుండి చివరి వరకు దారి పొడువునా సి.సి కెమెరాలు, డ్రోన్ కెమెరాలు ఏర్పాటుచేసినట్టు పేర్కొన్నారు. అన్ని చోట్ల పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. యాత్ర నిర్వాహకులు, భక్తులు, యాత్రలో పాల్గొనే ప్రజలు నిబంధనల ప్రకారం నడుచుకుంటు పోలీసులకు సహకరించాలని అన్నారు. ఎలాంటి రూమర్లును నమ్మవద్దని తెలిపారు. నిజామాబాద్ డివిజన్ మొత్తం సిబ్బంది పోలీస్ కమిషనర్, అదనపు పోలీస్ కమిషనర్లు, ఏసిపిలు, సిఐలు, ఎస్ఐలు, ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్స్ , కానిస్టేబుల్స్ , మహిళా కానిస్టేబుల్స్, స్పెషల్ పార్టీలు, ఇతర సిబ్బంది దాదాపు 1200 మంది బందోబస్తులో విధులు నిర్వహిస్తారని అన్నారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

హనుమాన్ జయంతి శోభయాత్ర సందర్బంగా కంఠేశ్వర్ ఆలయం నుండి జిల్లా పరిషత్ చౌరస్తా హమాల్వాడి, పాత ప్రభాత్ టాకీస్, లలితామహల్, రైల్వే గేట్, గంజ్ గేటు నెంబర్-2 గోదాం రోడ్డు, దేవి రోడ్డు మమతా సర్కిల్ గాంధీచౌక్, నెహ్రూ పార్క్, ఆజాం రోడ్డు పెద్దపోస్టాఫీస్, పెద్దబజార్, లక్ష్మీ మెడికల్, పోతలింగన్న దేవాలయం, రాజ రాజేంద్ర చౌరస్తా వరకు చేరుకుంటుందని అన్నారు. ఈ శోభయాత్రలో దేవత విగ్రహములు ఊరేగింపు సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు వచ్చి పాల్గొనే అవకాశం ఉన్నందున ఈరూట్‌లో గల దుకాణ యాజమానులు, నివాసం ఉండే వారు ఈనెల 22 రాత్రి 8 గంటల నుండి ఈనెల 24 ఉదయం 6 గంటల వరకు వాహనాలను శోభయాత్ర వేళ్లే మార్గంలో రోడ్డుపైన పార్కింగ్ చేయరాదని తెలిపారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలిగించరాదని అన్నారు. హైదరాబాద్ నుండి వచ్చి పోయే వాహనాలు ఆర్‌టిసి బస్ స్టాండ్ నుండి రైల్వే స్టేషన్, ఎన్‌టిఆర్ చౌరస్తా, కంఠేశ్వర్ బై పాస్ నుండి మాధవనగర్ బైపాస్ చేరుకోవాలని అన్నారు. బోధన్ నుండి వచ్చి పోయే వాహనాలు అర్సాపల్లి రైల్వే గేట్ నుండి కొత్త కలెక్టరేటు, కంఠేశ్వర్ బైపాస్, నీలకంఠేశ్వర్ దేవాలయం, ఎన్‌టిఆర్ చౌరస్తా , కోర్టు సర్కిల్, గ్లామర్, రైల్వే స్టేషన్ నుండి ఆర్‌టిసి బస్ స్టాండ్ చేరుకోవాలని తెలిపారు. బాన్సువాడ నుండి వచ్చి పోయే వాహనాలు వర్ని చౌరస్తా నుండి పులాంగ్ సర్కిల్ కోర్టు సర్కిల్ ఎన్‌టిఆర్ చౌరస్తా, రైల్వే స్టేషన్ నుండి ఆర్‌టిసి బస్ స్టాండ్ చేరుకోవాలని అన్నారు. ఆర్మూర్ నుండి వచ్చి పోయే వాహనాలు కంఠేశ్వర్ బైపాస్, కంఠేశ్వర్ దేవాలయం, ఎన్‌టిఆర్ చౌరస్తా, కోర్టు సర్కిల్, గ్లామర్, రైల్వే స్టేషన్ నుండి ఆర్‌టిసి బస్ స్టాండ్ చేరుకోవాలని, ఈ విషయాన్ని గమనించి ప్రయాణం చేస్తు ట్రాఫిక్ పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

ముడుపు కట్టిన బాజిరెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

కొండగట్టు ఆంజనేయ స్వామికి ముడుపు కట్టిన నిజామాబాద్ బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్. సోమవారం జగిత్యాల జిల్లాలో ప్రముఖ కొండగట్టు అంజన్న పుణ్యక్షేత్రంలో ఆంజనేయ స్వామిని బిఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి అనంతరం ముడుపు కట్టారు. బాజిరెడ్డి గోవర్ధన్‌ను జగిత్యాల శాసన సభ్యులు డా.సంజయ్‌కుమార్, మాజీ మంత్రి రాజేశంగౌడ్, ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే సంజయ్, రాజేశంగౌడ్‌లు శాలువాతో సత్కరించారు.

వడ్ల లారీ బోల్తా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఎదుట వడ్లలోడుతో వెళ్తున్న లారీ అధికలోడు కారణంగా బోల్తాపడింది. లారీ సిరికొండ మండలం నుంచి నిజామాబాద్ లోని ఒక రైసు మిల్లుకు వెళ్లుండగా మార్గ మధ్యంలోని డిచ్‌పల్లికి రాగానే ఆధికలోడు వల్ల వడ్లసంచులు పూర్తిగా ఒకవైపు వంగిపోవడంతో మెల్లిగా బోల్తాపడింది. ఈ ఘటనలో ఎవరికి గాయాలు కాలేదు. డ్రైవర్ తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. బోల్తాపడగానే క్యాబిన్ లోపల నుంచి డ్రైవర్ బయటకు వచ్చారు.



ఎరువులను

అందుబాటులో ఉంచాలి

- వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయధికారి

నవతెలంగాణ-బాల్కొండ

అన్ని రకాల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని జలాల్‌పూర్, ఇత్వార్‌పేట్ గ్రామాలలో జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్ తనిఖీలు నిర్వహించారు. జలాల్‌పూర్ గ్రామంలోని సొసైటీ గోడాన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువులను పిఓఎస్ మిషన్ ద్వారానే రైతులకు విక్రయించాలని ఎప్పటికప్పుడు అన్ని రకాల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని డీలర్లను ఆదేశించారు. అదేవిధంగా సంబంధిత స్టాక్ రిజిస్టర్లు, బిల్‌బుక్స్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని తెలిపారు. అనంతరం ఇత్వార్‌పేట్ గ్రామంలో నువ్వుల పంటను పరిశీలించి సరియైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచనలు చేశారు. మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి వరి కొనుగోళ్ల గురించి సొసైటీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మద్దతు ధరతో రైతుల నుంచి ధాన్యం సేకరించాలని ఆదేశించారు. వరి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా ఎప్పటికప్పుడు గన్ని బ్యాగులు, కూలీలు, లారీలను సమకూర్చుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడిఏ మల్లయ్య, ఏఈఓ నిహారిక, సొసైటీ కార్యదర్శి మొహీద్‌పాషా, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నివీర్, వాయుసేనలో ఉద్యోగావకాశాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆర్మీ, వాయుసేనలో ఉద్యోగావకాశాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భారత వైమానిక దళంలో నియామక బోర్డు (12 ఎయిర్మెన్ సెలక్షన్ సెంటర్) సికింద్రాబాద్, యువజన, క్రీడా శాఖ కామారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్కే డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అగ్నిపత్ స్కీమ్‌లో భాగంగా అగ్ని వీర్, వాయుసేనలో చేరుటకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అనిల్ గోస్వామి (సీనియర్ నాన్ కమిషన్డ్ ఆఫీసర్), నాలాం సందీప్ (నాన్ కమిషన్డ్ ఆఫీసర్) లు యువతను భారత వైమానిక దళంలో అగ్నివీర్, వాయుసేనలో ఉద్యోగ అవకాశాలు, ఎంపిక ప్రక్రియపై అవగాహన కల్పించారు. భారత వైమానిక దళంలో 17,5. ఎత్తు, 21 సంవత్సరాల వయసు గల అభ్యర్థులు చేరవచ్చని వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల డగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయ్ కుమార్, క్రీడల శాఖ సిబ్బంది రెండు డిగ్రీ కళాశాలలో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.